క్లుప్తంగా

శివ దీక్ష ప్రారంభం



ఆలయంలో భజనలు చేస్తున్న శివస్వాములు

ఆదోని అర్బన్: శివరాత్రి పండగను పురస్కరించుకుని శుక్రవారం శైవభక్తుల మండల దీక్ష ప్రారంభమయ్యింది. 41 రోజుల దీక్షను శివ స్వాములు గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో మాలధారణ చేశారు. ముందుగా శంభులింగేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, జ్యోతిర్లింగ మెట్ల పూజ, భజనలు జరిగాయి. అనంతరం గురుస్వామి శైలేంద్రనాథ్ దీక్ష నియమ నిబంధనలను వివరించారు.

నాటుసారా బట్టీల ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, సిబ్బంది

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని యల్లమ్మకొండలో నాటుసారా బట్టీలపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. వన్ టౌన్ సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ.. దాడుల్లో బోయ సురేష్, సంగ్రామ్ హబీబ్‌బాషా, బోయ అనితలను అరెస్టు చేశామని, మరో నిందితుడు బోయ వెంకటేష్ పరారీలయ్యాడని తెలిపారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాయిని, హీరో కంపెనీకి చెందిన డూయెట్ స్కూటీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఐదు ప్లాస్టిక్ డ్రమ్ముల్లోని సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను పారిపోసి డ్రమ్ములను, బట్టీలను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డా.గోపీనాథ్, ప్రసాదరావు

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్ వారిచే పట్టణంలోని కార్వన్‌పేట ప్రాంతంలోని నిరాశ్రయులైన వృద్ధులకు శుక్రవారం వంద దుప్పట్లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డా.గోపీనాథ్, ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలికి వణుకుతున్న వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణాధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, విశిష్ట సభ్యులు ఓంప్రకాష్, వనపరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఓగా నాగరాజుస్వామి


పెద్దకడబూరు : మండల పరిషత్ కార్యాలయ పరిపాలన (అడ్మినిస్ట్రేషన్) అధికారిగా నాగరాజుస్వామి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆదోని ఎగ్జిక్యూటివ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిగా ఇక్కడికి వచ్చారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, సంబంధిత అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కురువ సంఘం రాయలసీమ అధ్యక్షుడిగా నాగరాజు



ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హలేమనె నాగరాజు రాయలసీమ నవయువ కురువ సంఘం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. నాగరాజు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేస్తూనే కులం కోసం ఉత్సాహంగా పనిచేయడంతో ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం గుర్తించి రాయలసీమ అధ్యక్ష పదవిని అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. తనపై నమ్మకం ఉంచి ఇంతటి గౌరవాన్ని కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న విజయమహిళా మండలి సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయ మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాలాచారి అన్నారు. విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో సుఖవ్యాధులు, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ దేవేంద్ర, ప్రివెంటివ్ వర్కర్లు, అవుట్‌రిచ్ వర్కర్లు పాల్గొన్నారు.

పండుగ ముగిసింది..

వలస బండి కదిలింది

- గ్రామాల్లో ముగిసిన దేవర, సంక్రాంతి పండుగలు
- గిట్టుబాటుకాని ఉపాధి పనులు
- పనులు లేక పట్టణాల వైపు పయనం



చింతకుంట గ్రామం నుంచి లారీలలో గుంటూరుకు వెళ్తున్న కూలీలు

కోసిగి: గ్రామాల్లో గ్రామ దేవత దేవర, సంక్రాంతి పండుగ ముగిసింది. గ్రామాల్లో పనులు కరువయ్యాయి. ప్రభుత్వం కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పెరిగిన నిత్యవసర ధరలకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో చేసేది ఏమి లేక కూలీలు మూటముల్లె సర్దుకుని ఇళ్ల తాళాలు వేసి పిల్లాపాపలతో కలిసి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

రెండు రోజుల్లో రెండువేల మందికిపైగా వలస

కోసిగి మండలంలో ప్రతి గ్రామం నుంచి ప్రతి ఏటా వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా కూలీల బతుకులు మాత్రం మారడం లేదు. బుధవారం నాటితో సంక్రాంతి పండుగ ముగియడంతో గురు, శుక్రవారాల్లో కూలీలు లారీలు, టెంపోలతో తెలంగాణ, గుంటూరు పట్టణాలకు వలస వెళ్లారు. మండలంలోని చింతకుంట, ఆర్లబండ, వందగల్లు, కోసిగి గ్రామాల నుంచి దాదాపు 2వేల మందికి పైగా రెండు రోజుల్లో తరలి వెళ్లారు. ఎక్కువగా గుంటూరుకు వెళ్లారు. అక్కడ మిరప, పత్తి పోలాల్లో పనులు ఉంటాయని కూలీలు చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి పనులు లేక పోవడంతో ప్రతి ఏటా వలస వెళ్లి పనులు చేసుకోక పోతే కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోనే ఉంటే అప్పులు చేసుకుని బతకాల్సి వస్తోందని, వెళ్లిన చోటు కుటుంబ అంతట కష్టపడి పనిచేస్తే నాలుగు డబ్బులు వెనుకోగలుగుతామని చెబుతున్నారు.

ఆదుకోని ఉపాధి పనులు

ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామి పథకం కింద పనులు 100 రోజుల పనిదినాలు కుటుంబానికి నెలలోగా పూర్తి అవుతున్నాయి. అయినా పెరిగిన ధరలకు ప్రభుత్వం ఇచ్చే వేతనాలు గిట్టుబాటు కావడం లేదని కూలీలు చెబుతున్నారు. వెళ్లిన చోటు పనులు ముగిసేంత వరకు చేసుకుని తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటారు. వర్షకాలం గ్రామాల్లో వ్యవసాయ పనులు ప్రా రంభమయ్యే వరకు పనులు దొరకడం కష్టంగా ఉంటుంది.

పిల్లల చదువులకు ఆటంకం

వలసకు పెద్దలతో పాటు పాఠశాలకు వెళ్లే పిల్లలను సైతం తీసుకెళ్లుతున్నారు. పిల్లల చదువులు అర్ధంతారంగా నిలిచి పోతుండటంతో కోసిగి మండలం అనునిత్యం అక్షరాస్యతలో పూర్తి వెనుకబడి ఉంది. ప్రభుత్వాలు వెనుకబడిన కోసిగి మండలంపై ప్రత్యేక దృష్టి సారించి వలసల నివారణకు, అక్షరాస్యత పెంచేందుకు కృషి చేయాలని వలస కూలీలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



టెంపోలో వలస వెళ్తున్న కూలీలు

మా గ్రామం ఖాళీ అయ్యింది



మా గ్రామం నుంచి ఎన్నడూ లేని విధంగా వలస బాట పట్టి గుంటూరు, దోర్నాలకు వెళ్లారు. ఈ ఏడాది మిరప సాగు చేసుకున్న రైతులు పంటకు జెమిని వైరస్ సోకడంతో పూర్తి దెబ్బతింది. దీంతో రైతులు అప్పుల పాలయ్యారు. చేసేది ఏమి లేక అప్పులు తీర్చుకునేందుకు రైతులు కూడా పంట పొలాలను వదిలేసి వలస వెళ్లిపోయారు. కేవలం 10శాతం కుటుంబాలు మాత్రమే గ్రామంలో ఉన్నాయి. రెండు రోజులుగా 25 టెంపులలో ప్రజలు తరలి వెళ్లారు. – ఈరన్న, చింతకుంట

అక్షరాస్యతలో కోసిగి వెనుకబడి పోతోంది



అక్షరాస్యతలో ఇప్పటి కోసిగి మండలం పూర్తిగా వెనుకబడి ఉంది. ఇక్కడ ప్రాంత ప్రజలకు పనులు లేక ప్రతి ఏటా వలస బాట పడుతున్నారు. చదువుకునే పిల్లలను కూడా తమ వెంట తీసుకెళ్లుతున్నారు. పిల్లల చదువులు అర్థంతరంగా నిలిచిపోతున్నాయి. వెనుకబడి కోసిగి మండలంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యాభివృద్ధికి కృషి చేయాలి.
– వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

ఉపాధి పనులు కల్పిస్తున్నాం



జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో వలస వెళ్లవద్దని కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇక్కడ ప్రాంత కూలీలు అధిక డబ్బు సంపాదన కోసం వలస వెళ్తున్నారు. వలస వెళ్లి పిల్లల జీవితాలు నాశనం చేయవద్దు. గ్రామంలోనే ఉంటూ ఉపాధి పనులు చేసుకుని పిల్లలను చదివించుకోవాలి. – లోకేశ్వర్, ఏపీడీ

ఆదోనిలో అభివృద్ధి పనులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో వివిధ పథకాల కింద అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో మున్సిపల్ జనరల్ ఫండ్స్, అన్నా క్యాంటీన్‌లు, పీపీఎస్ అండ్ ఎల్ఆర్ఎస్ స్కీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తదితర పథకాల కింద మంజూరైన నిధులతో పట్టణంలో వాడవాడలా అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద మూడు సామూహిక మరుగుదొడ్లను రూ.90 లక్షలతో నిర్మించడం జరిగిందన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.31.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. మూడు అన్నా క్యాంటీన్‌ల నిర్మాణం కోసం రూ.36 లక్షలతో నిర్మాణం పనులు పూర్తి చేశామన్నారు. బీపీఎస్ అండ్ ఎల్ఆర్ఎస్ పథకాల కింద అభివృద్ధి పనులకుగానూ రూ.44.65 లక్షలతో ప్రధాన, గల్లిలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను చేయనున్నట్లు వెల్లడించారు. ఆయా పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అయ్యిందని, త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు

- తమకే కావాలని పోటీ పడుతున్న బీజేపీ, టీడీపీ నాయకులు
- పరిశీలన కోసం టెండర్‌లను జేడీకి పంపిన యార్డు అధికారులు



టెండర్ వేస్తున్న కాంట్రాక్టర్లు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు భోజనం, టిఫిన్ కోసం రెండు క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం యార్డు అధికారులు టెండర్‌లను నిర్వహించడంతో కాంట్రాక్టర్‌లు శుక్రవారం టెండర్లను దాఖలు చేశారు. మహాలక్ష్మమ్మవ్వ బ్యాంకు పక్కన ఒకటి, ఓల్డ్ వాచ్‌మెన్ క్వార్టర్స్ వద్ద మరో క్యాంటీన్ ఉన్నాయి. ఒకదానికి ఎనిమిది మంది, మరొకదానికి ఆరు మంది టెండర్లు దాఖలు చేశారు. ఇందులో టీడీపీ, బీజేపీ నాయకులు రహస్యంగా పోలీసుల సమక్షంలో టెండర్లు వేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాంట్రాక్టర్‌లు టెండర్ దాఖలు చేయగా.. మధ్యాహ్నం 3.30 గంటలకు యార్డు అధికారులు దాఖలు చేసిన వాటిని స్క్రూటీని చేసి పరిశీలన కోసం కడపలోని జేడీకి పంపించినట్లు యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ, బీజేపీ నాయకుల పోటాపోటీ

తమకంటే తమకే కావాలని బీజేపీ, టీడీపీ నాయకులు క్యాంటీన్‌లను తీసుకోవాలని పోటీ పడుతున్నారు. ఎవరికి ఇవ్వాలో తెలియక టెండర్ దాఖలును స్క్రూటీని చేసి జేడీకి పంపారు. ఒకరికి ఇస్తే మరొకరు కూటమి నాయకుల్లో గొడవలు పడే అవకాశం ఉంది. దీంతో చాకచక్యంగా అధికారులు జేడీకి పరిశీలనకు పంపినట్లు తెలిసింది. అయితే కూటమి నాయకుల్లో ఎవరికి దక్కుతుందోనని కూటమి నాయకులు ఆందోళన చెందడంతో పాటు ఒకరిపైఒకరు భగ్గుమనుకునే అవకాశం ఉంది.

వైభవంగా మారెమ్మవ్వ కల్యాణోత్సవం



వేడుకను తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) అలంకరణలో మారెమ్మవ్వ

హొళగుంద: మండలంలోని సమ్మతగేరి గ్రామంలో వెలసిన మారెమ్మ కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయం ముందు పెళ్లి పందిరి వేసి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అమ్మవారికి అభిముఖంగా దున్నపోతు దూడను ఉంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మాంగల్యధారణ గావించారు. భక్తులకు అన్నదానం చేశారు. చుట్టుపక్కల పల్లెలతో పాటు ఆంధ్ర – కర్ణాటకకు చెందిన భక్తులు హాజరై మారెమ్మను దర్శించుకున్నారు. మూడేళ్ల తరువాత నిర్వహించే దేవరకు ఈ కార్యక్రమం నాంది అని గ్రామస్తులు పేర్కొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

పత్తికొండ(తుగ్గలి) : నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో క్రైం మీటింగ్ నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. నేరస్తులపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు రమేష్, లక్ష్మన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. శేఖర్, సుధాకర్, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ , గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమాలు, మంగళ హారతులు చేపట్టారు.

బాలికలకు సమాన హక్కులు

మద్దికెర : బాలికలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయని వాటిని హరింపజేయాలని చూస్తే చట్టం కఠినంగా శిక్షిస్తుందని సీడీపీఓ లలిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. యుక్త వయస్సులో బాలికల్లో చోటు చేసుకునే శారీరక, మానసిక మార్పులకు అనుగుణంగా సానుకూల ప్రవర్తన కలిగి ఉండేలా సూచించాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీఓ కొండయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి

కోసిగి: కౌలు రైతులకు పంట రుణాలు అందించి ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, తిమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు కోరారు. శుక్రవారం కోసిగి స్టేట్ బ్యాంక్ మేనేజర్ కార్తీక్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ చాల మంది భూమి లేని రైతులు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి కౌలుకు చేసుకుంటున్న వారికి నేటికీ కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదన్నారు. కౌతాళం సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, రైతులు రోశయ్య, ఈరన్న, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

గోనెగండ్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన బోయ రమేష్(33) చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ, మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు గోనెగండ్లకు చెందిన బోయ రమేష్‌కు భార్య సుజాత, కుమారుడు, కుతూరు ఉన్నారు. రమేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే ఈనెల 13వ తేదీ రాత్రి రమేష్ గోనెగండ్లలోని బీసీ కాలనీలో తమ బంధువుల ఇంట్లో భోజనం చేసి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. హెచ్.కై రవాడి గ్రామానికి చెందిన ఉప్పరి అశోక్, గోనెగండ్లకు చెందిన గోపాల్ అతిగా మద్యం సేవించి బైక్‌పై వెగంగా వెళ్తూ ఢీకొట్టారు. గాయాలపాలైన రమేష్‌ను స్థానికులు రమేష్‌ను గోనెగండ్ల ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్–నాగలాపురం గ్రామ పొలాల్లో గురువారం ఉరి వేసుకుని బోయ శివ అనే వ్యక్తి మృతిచెందినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోని పట్టణంలోని మండిగిరికి చెందిన బోయ శివ(34) అనే వ్యక్తి గురువారం ఎమ్మిగనూరు జాతరకు వెళ్లి తిరిగొస్తుండగా ఆరేకల్–నాగలాపురం మధ్యలో ఉన్న ఈడిగ సరసమ్మ పత్తి పొలంలోని వేపచెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. భార్య బోయ పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

23న మున్సిపల్ షాపుల వేలం

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపుల వేలం పాటలను ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తెలిపారు. గతంలో షాపులను దక్కించుకున్న యజమానులు షాపుల అద్దెలను చెల్లించకపోవడం వల్ల కొన్ని షాపులకు వేలాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 17 షాపులకు ఈనెల 23వ తేదీన వేలం పాటలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు సీనియర్ కబడ్డీ సెలక్షన్స్

ఆదోని సెంట్రల్: ఈనె 19వ తేదీ సీనియర్స్ కబడ్డీ సెలక్షన్ పోటీలు ఉంటాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, కార్యదర్శి సుభకర్, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాశ్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కబడ్డీ పోటీలలో సీనియర్స్ పురుషులు, మహిళలకు సెలెక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వారి ఆధార్ కార్డుతో సంప్రదించాలన్నారు. పురుషుల బరువు 85 కేజీలు, మహిళల బరువు 75 కేజీలు ఉండాలన్నారు. ఇక్కడ ఎంపికైన వారు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం అంకుపాలెంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ 97010 12329 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, హెల్త్ సిబ్బంది

కోసిగి: కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నిర్మూలనకు కృషి చేద్దామని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సి.రజిత పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి ఏఎన్ఎమ్స్, ఆశావర్కర్స్, హెల్త్ సిబ్బందితో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్పిటల్‌లో హెల్త్ సిబ్బందికి కుష్టు లక్షణాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి స్పర్శలేని మచ్చ, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పులేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, ముక్కుదూలం అణిగిపోవుట, శ్వాస ఆడకపోవుట, బొటనవ్రేలు, చిటికెన వేలు, మణికట్టు పనిచేయకపోవుట, పాదాలు, చేతులు బొబ్బలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈనెల 20వ తేది నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్స్ ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్స్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



మృతిచెందిన వడ్డె దరగమ్మ

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని కిందిగేరికు చెందిన వడ్డె దరగమ్మ(25) అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు నాగప్ప, అంజినమ్మలకు చెందిన కూతురు దరగమ్మను హెచ్. కై రవాడి గ్రామానికి చెందిన వీరెంద్రకు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి రెండేళ్ల కూతురు కూడా ఉంది. దరగమ్మ సంక్రాంతి పండుగను పుట్టింటిలో చేసుకోవాలని ఇటీవల గోనెగండ్లకు వచ్చింది. అయితే శుక్రవారం ఉదయం తల్లి కూలీ పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంట్లో(కొట్టంలో) ఎవరి లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దరగమ్మ కూతురు ఏడుస్తూ ఉండడంతో చుట్టూ పక్కల వారు వచ్చి ఇంట్లో చూశారు. ఇంట్లో దరగమ్మ ఫ్యాన్‌కు వేలాడుతున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, విచారించారు. దరగమ్మ కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. కడుపునొప్పితాళలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంపై సీఐ గంగాధర్‌ను సంప్రదించగా దరగమ్మ మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కోయిలకొండలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏపీసీ శ్రీనివాసులు

కృష్ణగిరి: జిల్లాలో సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సొసైటీలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి (ఎస్ఎస్ఏ ఏపీసీ) శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని కోయిలకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను శుక్రవారం ఆయన సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సురేష్ రాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 10 మండలాల్లో వలస వెళ్లే విద్యార్థుల కోసం 34 హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిల్లో దాదాపు 1,736 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. ఇందులో మండలంలో కూడా ఐదు హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. సర్వశిక్షా అభియాన్ సహకారంతో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, అయితే సొసైటీలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వలస వెళ్లిన కుటుంబాల పిల్లలకు హాస్టల్ వసతితో పాటు సాయంత్రం పూట ట్యూషన్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

కలుపు యాజమాన్యంతో అధిక దిగుబడులు



గోనెగండ్లలో సాగుచేసిన వరి పంట



ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల : ఈ రబీ సీజన్‌లో వరి పంటను సాగుచేసిన రైతులు పొలంలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం గోనెగండ్లలో వరి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో కొన్ని చోట్ల వరి నాట్లు వేస్తుండగా మరికొన్ని చోట్ల ఇప్పటికే పూర్తి చేశారు. ఇప్పటి నుంచే వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నాటిన 3 నుంచి 5రోజుల లోపు బుటాక్లోర్ 1 నుంచి 1.5 లీటర్లు లేదా ప్రిటిలాక్లోర్ 500–600 మిల్లీ లీటర్లు లేదా ఆక్సీడయాగిజిరిల్ 35 నుంచి 40 గ్రాములు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. నాటిన 15 నుంచి 20 రోజులకు ఎకరానికి సైహలోపాస్ బుటైల్ 250–300 మిల్లీ లీటర్లు లేదా పినాక్రొపాప్ ఇథైల్ 250–300 మిల్లీ లీటర్లు లేదా మెట్సల్ఫ్యూరాన్ మిథాయిల్, క్లోరిమరాన్ ఇతేల్ 8గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. వెడల్పు ఆకు కలుపు నివారణకు నాటిన 25–30 రోజులకు 2,4 డిసోడియం సాల్ట్ అనే మందు ఎకరానికి 500–600 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలని చెప్పారు. గడ్డిజాతి మరియు వెడల్పు ఆకు కలుపు నివారణకు బిస్పైరిబాక్ సోడియం ఎకరానికి 100 మిల్లీ లీటర్లు(అనగా లీటర్ నీటికి 0.5మిల్లీ లీటర్లు)200 లీటర్ల నీటికి కలుపుకొని 15 నుంచి 20 రోజుల మధ్యలో పిచికారీ చేసుకోవాలన్నారు.